# తప్పటడుగు

పన్నాల రంగనాథరావు



ప్లాట్‌ఫారమ్ మీద కాలు పెడుతూనే, "నేను తప్పటడుగు వేయటం లేదుగదా?" అని తనలో తాను ప్రశ్న వేసుకున్న ప్రసాదరావు, కాలు జారి, చేతిలో ఉన్న సూట్‌కేసుతోసహా, క్రిందపడబోయినాడు. ఎదురుగా ఉన్న వ్యక్తి, రాకెట్‌లా గొచ్చి ఆనుకోకపోయి ఉంటే నిజంగానే కాలు విరిగేది.

"సామిరంగ! తెలుగుముఖంలాగనే ఉందే! అరవ సోదరుల తర్వాత మళ్లీ అచ్చు గుద్దిన ముఖాలు మనవే! ఎక్కడికి పోతై? నా పేరు—ఫలానా శాస్త్రి. మీ పేరు—తరువాత చెవుతాగా! కాస్త జాగ్రత్తగా చూసి మరీ అడుగువేయండి.కొత్తగా వచ్చినట్టున్నారు. మన్ది చాలా అర్జంటు—కని పిస్తాగా! ఒస్తా..."

ఈ వాగ్ధాటితో, తాను వేసుకున్న ప్రశ్న మాటే మరిచిపోయిన ప్రసాదరావుకు కొన్ని నిమిషాలవరకూ అంతా అలుక్కుపోయినట్టు కనిపించింది. అతను తేరుకునే సరికి, ఆ వ్యక్తి ముందుకు దూసుకుపోయి జనంలో కలిసిపోయినాడు.

*     *     *     *

ఢిల్లీలో తెలుగువాళ్లకు ఆ ఆదివారం ఒక పర్వదినం లాంటిది. తెలుగు నాటక సమితి పెద్దల ధర్మమా అని, సమితి వార్షికోత్సవం పురస్కరించుకొని, ఆ సాయంకాలం ఆరు గంటల నుంచి ఒక కార్యక్రమం ఏర్పాటుచేశారు. మామూలుగా ముందు జరుప వలసినవన్నీ జరిపాక, ఒకానొక అక్కచెల్లెళ్ల 'డాన్సు'-ఆ తర్వాత 'కన్యాశుల్కం'లో కొన్ని ఘట్టాల ప్రదర్శనం.

ఇటువంటి దేదైనా తటస్థపడితేనేగాని, ఉన్న తెలుగువాళ్లు నలుగురూ ఒకచోట కలుసుకునే అవకాశం లేదు. తెలుగు సినిమాలూ, నాటకాలూ, ఇత్యాది వ్యాపకాలకోసం, ఎప్పుడూ కాచి ఉంటున్న ముఖాలు కావటం మూలాన, ఏ తెలుగు కార్యక్రమం జరిగినా పండగలాగే ఉంటుంది.

'డాన్సు' కార్యక్రమం జరుగుతుండగా, గిరీశం పాత్రధారి ప్రసాదరావు పూర్తి వేషంలో, ఒక మూల గ్రీన్‌రూంలో నిలువుటద్దం ముందు నిలబడి తన పాత్రాభినయాన్ని తానే రిహార్సు చేసుకొని చూసుకుంటున్నాడు. అసలీ పాత్రవు వెయ్యటానికి తన దృష్టిలో తగ్గవాడు శాస్త్రి.

*చేసిన పని ఎంత చిన్నది అయినా ఎవరైనా మెచ్చుకొంటే, అందులోనూ మహామహులతో పోల్చితే — కాబోలు అనుకొంటారు. శ్రద్ధాసక్తులు తోడు అయితే నిజమైన అనుబంధం ఏర్పడుతుంది. స్వతంత్రంగా ఆలోచించే శక్తి నశిస్తుంది, ఎవరికైనా. దానితో జీవితానికి రాచబాట ఏర్పడుతుంది.*



కాని, డైరెక్టర్‌గారి అభిప్రాయం వేరు. డైరెక్టర్‌గారు ఒకసారి తనతో అన్నారు: 'వెనకటికోసారి శ్రీ శ్రీ అన్నట్టు గిరీశం నవ్వుపుట్టించేటట్టు మాట్లాడే ట్రాజిక్ హీరో. అందులో ఇమిడి ఉన్న ట్రాజెడీని అర్థంచేసుకొని ఆ పాత్ర నటించా'లని. గిరీశం వేయటానికి శాస్త్రి ముఖ కవళికలు కూడా సరిపడవని ఆయన వాదం. కరటక శాస్త్రి పాత్రకు శాస్త్రి టంకం పాడిలా అతుకుతా డన్నారు. డైరెక్టర్‌గారి నిర్ణయమే తుది నిర్ణయం. ఏ పాత్ర ఎలా నటించాలో, ఏ మాట ఎలా పలకాలో ఆయన స్వయంగా అభినయించి చూపినట్టు ఇంకెవరికీ చేతకాదు. లుబ్ధావధాన్ల పాత్రను ఆయనే స్వయంగా వేస్తున్నారు. నూటికి నూరు పాళ్లు లుబ్ధావధాన్లే!

రిహార్సల్సులో ఫరవాలేదనిపించిన ప్రసాదరావుకు డైరెక్టర్‌గారి మాటలు జ్ఞాపకం రాగానే బెదురు పుట్టుకొచ్చింది. డైలాగు తుంపుడు ముక్కలల్లే వస్తూంది.

"డామిట్...ఇది...ఇది.... బేసిక్ ఇన్‌గ్రాటిట్యూడ్.... నాతో మాట్లాడ్డమే..ఎడ్యుకేషన్... విడో మ్యారేజ్... నాచ్ కొశ్చన్... విషయమై... ఎన్ని లెక్చర్లిచ్చాను..."

"ఇచ్చా రిచ్చారు."

అద్దంలోంచి వెనకవైపున కనిపించింది— నవ్వుతూ, మధురవాణి!

*  *  *  *

రామచంద్రన్‌గారని, కేంద్రంలో ఒకానొక శాఖకు స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చి ఎంతోకాలం కాలేదు. కొద్ది మంది పెద్దలకు తప్ప, ఆయన గురించి తెలిసిన వారు మామూలు జనంలో దాదాపెవరూ లేరు. "మేము ఆంధ్రాస్ దా!' అంటా రాయన, కాకపోతే ఏదో తక్కువైనట్టు. నిజానికి, పాపం, ఆయన తెలుగువాడే. కాని, ఆయన పుట్టింది తమిళ దేశంలో. ఆయన తాతగారు స్వస్థలం విడిచిపెట్టి సర్కారు నౌకరీ మూలంగా తమిళ దేశంలో స్థిరపడిపోయినారు.

రామచంద్రన్‌గారు నౌకరీలో అడుగుపెట్టేటప్పటికి, ఇంట్లో భాష మూడొంతులు తమిళం, ఒక వంతు తెలుగూ అయింది. ఆయనకు వరసగా ముగ్గు రాడపిల్లలూ, కడగొట్టు పిల్లవాడూనూ. ఇద్ద రాడపిల్లలు పెళ్లికి సిద్ధంగా ఉన్నారు. పిల్లవాడు పదేళ్లవాడు. ఉత్తరాదిలోనే రామచంద్రన్‌గారు ఎక్కువకాలం గడుపుతూ ఉండటంవల్ల, అతని సంతానం కొంత హిందీ, కొంత తమిళం మాట్లాడతారు. తెలుగు అర్థంచేసుకోగలరు.

రామచంద్రన్‌గారికి ఇంకా ఇల్లు కుదరలేదు. తాత్కాలికంగా ఒక యం. పి. గారింట్లో మకాం వేశారు. ప్రభుత్వం వారి ఇల్లు దొరికేవరకూ కుటుంబాన్నీ, కారునూ రప్పించదలచలేదు. ఆయన తెలుగువాడే అని పసికట్టిన ఉత్తరక్షణం ఆయనతో దోస్తీ కలుపుకొన్నవాడు ఒక్క శాస్త్రి. శాస్త్రి ప్రోద్బలంమీదనే ఇప్పు డాయన ఈ కార్యక్రమానికూ్కడా వచ్చాడు.

రామచంద్రన్‌గారు పెద్దలందరితోపాటు ముందు వరుసలోనే కూర్చొని, నాటకాన్ని అందరికన్నా ఎక్కువగా ఆనందించాడు. నాటకం ముగిసిన వెంటనే కొంత మంది పెద్దలు స్టేజ్‌లోనికి దూసుకుపోవడం రివాజు—పైసా ఖర్చులేకుండా ఉచితంగా ఇచ్చే అభినందనలు ఇవ్వటానికి.

రామచంద్రన్‌గారు ముందు కాస్త తటపటాయించినా, తరువాత ఆయన కూడా స్టేజ్ లోనికి, అక్కడినుంచి ఏకంగా గ్రీన్‌రూంలోనికి వెళ్లారు. ప్రసాదరావు గిరీశం ఆయనకు బాగా నచ్చాడు. ప్రసాదరావూ, మధురవాణి పాత్రధారిణీ ఇద్దరూ అక్కడే ఉన్నారు.

"నిండా బాగా యాక్ట్ చేసినారు" అన్నారు రామచంద్రన్ గారు.

"ఏమో, పూర్తిగా తగలెట్టా మనుకుంటున్నాం" అన్నది మధురవాణి, ఆయన ఎవరో తెలియకుండానే.

"అదేంమాట. స్థానం నరసింహారావుఉండారే, మెడ్రాస్‌లో ఇదిదా వేసిరి, చూస్తిని. స్థానం మాదిరి మీరు బ్రిల్లియంట్‌గా చేసినారు. గిరీశం వండ్రఫుల్" అన్నారు రామచంద్రన్‌గారు.

ఇంతలో అక్కడికి 'కరటక' శాస్త్రి వచ్చాడు.

"నమస్కారం సార్. ఎల్లా ఉందంటారు?' అన్నాడు.

"అంతా రొంబ అళహా యాక్ట్ చేసినారు. బ్రిలియంట్‌గా ఉండాది."

రామచంద్రన్‌గారిలాంటిభాష మాట్లాడుతూ తెలుగువారమనే చెప్పుకునేవారు ఇంకా చాలా మంది ఉన్నారు. వీరిలో కొందరు సమయానుకూలంగా తెలుగు చెవులకు వినపడకుండా తమిళుల మనే చాటుగా చెప్పుకొనేవారు కూడా లేకపోరు. పాపం, రామచంద్రన్‌గారు పెద్దమనిషే అయినా, అటువంటివారు మాత్రం కారనే మనం అనుకుందాం. ఎందుకంటే అటువంటివారు కారని పూర్తిగా సాక్ష్యం దొరికే వరకూ మన సోదరులెవరూ సామాన్యంగానమ్మరు. కాస్త తెలుగొచ్చిన అరవాయనగానే జమకడతారు. రామచంద్రన్‌గారల్లే మాట్లాడేవారు అరుదుకారు కాబట్టే ఆయన ధోరణి ఎవరికీ ఆశ్చర్యం,

విద్వారం కలిగించలేదు.

రామచంద్రన్‌గారు ఫలానా ఫలానా.

ప్రసాదరావు ఫలానాచోట, చిన్న ఉద్యోగం తాత్కాలికం.

ఆవిడేమో సరోజిని. ఫలానా రెండో ప్రపంచ యుద్ధం చివరి రోజుల్లో కుటుంబంతోసహా ఇక్కడికొచ్చి స్థిరపడిపోయినారు సరోజిని తండ్రి గారు, అంటే ఆమె సదోదీట. పాపం ఆయన అంతా ఈ మధ్యనే పోయినారు. సరోజిని ఫలానా స్కూలులో టీచరు. తల్లిని పోషించటం, తమ్ముడికి చదువు చెప్పించటం. ఈ వివరాలు చెబితే ఇక అవివాహిత అని వేరే చెప్పనక్కర్లేదనుకొని చెప్పలేదు శాస్త్రి.

ఈ గొడవంతా ముగిసేసరికి రాత్రి పది కావచ్చింది. ప్రసాదరావు తన గదికి చేరుకునేసరికి పదకొండుకూడా దాటింది.

* * * *

ఒకానొక ఎరిగిన పెద్దమనిషి సిఫార్సు మూలంగా, ఆరు నెలల ఖాళీలో నౌకరీ చేయటానికి ప్రసాదరావు ఢిల్లీ వచ్చి అప్పుడే అయిదు నెలలు ఖర్చయిపోయాయి. ఆరు నెలల తర్వాత అంతపెద్ద పట్నంలో, ఇంకేదో ఒకటి ఏర్పాటు కాకపోతుందా అనే విశ్వాసంతోనే ఇంతదూరం రావటానికి సిద్ధపడ్డాడు ప్రసాదరావు. ఈ నెలా గడిచాక ఏం చేయాలో ఆలోచించాలంటేనే దడ పుట్టుకొస్తుంది గనుక ప్రసాదరావు ఇంకా గట్టిగా ఆలోచన పెట్టుకోలేదు. అతననుకొన్న ఏర్పాటుమాత్రం ఇంకా గురికి బారెడుదూరంలో కనిపించలేదు. అంతగా ఏదీ దొరక్కపోతే, ఇక్కడికి తాత్కాలికంగా వచ్చినట్టే తిరిగి తాత్కాలికంగా ఇంటికి పోవచ్చు! నలుగురు సంతానంఉన్నా, అన్నయ్యా వదినా కాద్రమ. తల్లి ఉంది. కొడుకులిద్దరూ ఒకదగ్గరే ఉండాలని ఏ తల్లికిమాత్రం ఉండదు? ఆ మాటకొస్తే తను, ఈ ఆర్నెల్ల ముచ్చటకు ఇంతదూరం రావటం, ఎవరికీ ఇష్టం లేదు.

"ఆపాటి ఇక్కడే దొరకదా ఏమిటి? ప్రయత్నిద్దాం. కాలం కలిసిరావాలా?" అన్నాడు అన్నయ్య.

"దేశాలు పట్టి పోతావుట్రా నాయనా?" అన్నది తల్లి.

"చూడు ప్రసాదూ! వెళితే వెళ్లావుగాని అక్కడి తిండి ఒంటపట్టకుంటేమాత్రం వెంటనే వచ్చెయ్యి. తెలిసిందా?" అన్నది వదిన.

ఇంట్లో ఈ పాటి అభిమానం లేకుంటే, ఏనాడో దేశాలు పట్టిపోయేవాడే ప్రసాదరావు.

ప్రసాదరావు తండ్రి, బతికినన్నాళ్లూ అప్పులతో బతికిన మనిషి. ఆయన పోయినప్పటికీ తీరకుండా ఉండిన అప్పుల్లో సగమైనా తీర్చవలసిన నైతిక బాధ్యత తనమీద ఉందని ప్రసాదరావు ఎరుగును. ఇంతవరకూ తను స్వయంగానే దమ్మిడీ అయినా తీర్చలేకున్నంత మాత్రాన, అన్నయ్య ఇంకో విధంగా భావించ

# తప్పటడుగు

లేదు. ఆమధ్య తను ఒక వంద రూపాయలు పంపితే —

"ముందక్కడ నీ అవసరాలు చూసుకో, పట్నమంటేనే ఖర్చుజాస్తి. నువు పంపిన వందా అమ్మ కిచ్చాను—" అంటూ జవాబు రాశాడు అన్నయ్య.

శాస్త్రి ఇంకెక్కడో ఒక ఖాళీగురించి ఆ మధ్య ఏదో కొంత చెప్పాడు. సమయం రాగానే దరఖాస్తు పారెయ్యచ్చన్నాడు. ఆ ఖాళీ తప్పక తనకోసమే రాసిపెట్టి ఉందని హామీకూడా ఇచ్చాడు. ఇటీవల ఈ నాటకం గొడవలోపడి, ఆ సంగతే ఎత్తలేదు అసలు. ఈ ఊళ్లోనే కాదు, ఎక్కడేనా సరే బాగా బతకనేర్చినవాడు శాస్త్రి. ఉంటే ఏ లోటూ లేకుండా జరిగిపోయే నౌకరీ అయినా ఉండాలి, లేదా శాస్త్రిలాంటి వాడైనా కావాలి ఈ పట్నంలో. ఆ నాడు తను స్టేషన్లో దిగగానే రాకెట్‌అల్లే వచ్చి, ఏదో దడబడా అనేసి తిరిగి జనంలోకి దూసుకుపోయిన ఈ 'ఫలానా' శాస్త్రి—తనకు కొంత వరకూ ఈ విధంగా సన్నిహితు డవుతాడని అతను ఊహించలేదు.

ప్రసాదరావు ఊహించలేనిది మరొకటేమిటంటే, శాస్త్రివంటి వా డొకడు ఇక్కడకూడా ఉండి, ఆ 'కొరత' కాస్తా తీర్చుతాడని. తను నౌకరీలో చేరిన రోజునే బస్సుస్టాండు దగ్గర పట్టేశాడు శాస్త్రి.

"హలో బ్రదర్! పనిలో చేరారా?"

ప్రసాదరావు ఒకసారి స్తబ్ధుడై వెంటనే తేరుకున్నాడు.

"మొన్న స్టేషన్‌లో మీ చేతిలో ఉన్న మాటు కేసు పట్టుకొని కింద పెట్టేటప్పుడు దానిపైన మీ పేరు పట్టేశాన్లెండి. ప్రసాదరావుకదూ? నా పేరు ఫలానా శాస్త్రి. భలేగా ఉందికదూ!"

"ఫలానా శాస్త్రా?"

"ఇక్కడంతా అలాగే అని సంతోషిస్తారు. ఇక్కడ ప్రతివాడూ, అవతలి వాడికన్నా ఓ మెట్టు పైనున్నా ననుకుంటూ ఉంటాడు. ఎదటివాడు ఏడ్చినా ఉడుక్కున్నా తృప్తిగా సంతోషిస్తాడు. మనం దేనికైనా ఉడుక్కునేరకం కాదు లెండి. ఓ! చాలా మూశాం! అసలు పేరు పరబ్రహ్మ శాస్త్రి! ఎందాకా వెళ్తున్నారు? పదండి నేనూ వస్తా!"

> ప్రేమ వైద్యశాస్త్రం వంటిది.
> రెండింటి ప్రయోజనమూ ఒక్కటే.
> ప్రకృతికి తోడ్పడటమే అది.

ఇద్దరూ బస్సెక్కారు.

"మనం మెడ్రాస్ హోటేలు దగ్గర దిగి ముందు కాస్త 'నాస్తా' వేద్దాం" అన్నాడు శాస్త్రి.

"నేను ప్రస్తుతం ఉంటున్నది కూడా అక్కడే లెండి" అన్నాడు ప్రసాదరావు.

"అచ్ఛా! ఓ గదికి నలుగురు బాపతా! అదేం కుదరదు. మీరు కరోల్‌బాగ్ రావలసిందే! నే చూసిపెడతాగా!"

నిజంగానే చూసిపెట్టాడు శాస్త్రి.

మూడో అంతస్థుపైన ఒక్కటేగది. కాలకృత్యాలకు గది ప్రక్కనే ఏర్పాట్లు. మిగతాది విశాలమైన డాబా. ఇక్కడిజనం, 'బర్సాతీ' అనే ఇటువంటి గదుల్లో పెద్ద పెద్ద కుటుంబాలే వుంటాయనీ, అదృష్టంకొద్దీ ఇది దొరికిందనీ, బ్రహ్మచారి జీవితానికి ఇది బహు ఆదర్శప్రాయమైందనీ శాస్త్రి చెబితే ప్రసాదరావు మొదట్లో నమ్మలేకపోయాడు. అక్కడికి కొద్ది దూరంలోనే శాస్త్రి కూడా ఇటువంటి ఏర్పాటులోనే ఉంటున్నాడు.

శాస్త్రి చేస్తున్న ఉద్యోగం కూడా అంత పెద్దదేం కాదు. పై వ్యాపకాలలో ఉండే శ్రద్ధ, అతనికి ఉద్యోగంమీద లేదు.

"నా కసలు ఈ ప్రభుత్వ నౌకరీలంటే మోజులేదు భాయ్! ఎప్పుడో ముహూర్తం చూసి అమాంతం ఫిలిం రంగంలో కాలు పెట్టేస్తాను. రెడ్డిగారు తప్పటడుగు వేయనివ్వర్లే. చాలా గట్టివాడు. మనుషుల్ని ఎంపుడు చేయడం బాగా చేతనైన వాడు. అవకాశం రాగానే రాస్తామన్నార్లే! ఏదీ ఈ మధ్యనే మళ్లీ ఓ ఉత్తరం పడేశాను" ఇది శాస్త్రి ధోరణి.

"పెళ్లయిన వాడివి కదా, ఏదో ఇంత తెచ్చుకుంటున్నావు. పెళ్లాన్ని తీసుకొచ్చి సుఖంగా కాపురం చేసుకోరాదా?" అన్నాడు ప్రసాదరావు ఒకసారి శాస్త్రితో.

"చెప్పితివి కానా భాయ్. ఈ నౌకరీ అట్టే కాలం చేయనని? సంపాదన నెలకు కనీసం ఓ వెయ్యేనా లేకుంటే మనం కాపురం చెయ్యలేమే! అదీకాక, ఇల్లు కుదరద్దా?" అన్నాడు శాస్త్రి.

"నువ్వు తలచుకుంటే ఇల్లే కుదరదా? నేన్నమ్మను, ఇప్పుడున్న గదికేం లోటు?" అన్నాడు ప్రసాదరావు.

"బ్రహ్మచారులు ఉండాల్సిన గదుల్లో కాపరమెట్లా?"

"అందరూ ఉండటంలా?"

"మన వ్యవహారం వేరు కదా! ఒకవేళ మనం ఈ నౌకరీల్లోనే పాతుకుంటే, మనం రిటైరైతేనేగాని గవర్నమెంటిల్లు రాదు. ఇప్పుడు మన కిస్తున్న జీతమంతా కక్కేస్తూ ఉంటేనే గాని కనీసం ఒక మూడు గదుల కొంపేనా రాదు. ఎందుకీ గొడవ? నెలకు వెయ్యి తెచ్చుకొనే దాకా

వన్నిట్లా సుఖంగా ఉండనీ—''

శాస్త్రి పెళ్ళాం పొరుగింటి 'అబ్బాయిని' మరిగిందనీ, వాళ్ళిద్దరూ ఒకరోజు 'కులాసాకబుర్ల'లో ఉండగా శాస్త్రి కంట బడ్డారనీ, ఆ నాటి నుంచీ శాస్త్రి మళ్ళీ పెళ్ళాం ముఖం చూడలేదనీ, దేశం వదిలి వొచ్చేశాడనీ శాస్త్రి పెళ్ళాం చివరికి ఆ "అబ్బాయి"తో లేచిపోయిందనీ, ప్రసాదరావు ఎవరో అనుకుంటూ ఉండగా విన్నాడు. ఇందులో నిజం ఎంతో ఎవడు చూశాడు? ఎదురుగా కనిపించే వ్యక్తి గురించి ఇటువంటి కథలకు అంకురార్పణం జరిగితే, అవి ఎంత దూరమైనా అలా అలా అల్లుకు పోతై. శాస్త్రి స్వయంగా ఈ విషయం ఎలా చెప్పగలడు? అయినా అతని మాటలబట్టి నిజం ఎంతుందో గ్రహించవచ్చు. అందుకే ప్రసాదరావు ఈ ప్రశ్నలు వేశాడు.

శాస్త్రి తప్పటడుగు వేశాడనుకున్నాడు ప్రసాదరావు. బ్రతకనేర్చిన వాడు గనుక, ఎక్కడి కక్కడికి ఏదైనా దులిపేసుకోవడం చేతనైంది శాస్త్రికి.

ప్రసాదరావుకు సరోజినితో మొట్టమొదటి పరిచయం శాస్త్రి మూలంగానే కలిగింది. నాటకంలో పాత్ర తీసుకోవాలని కోరడానికి ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు శాస్త్రి తనను కూడా వెంటతీసుకు పోయినాడు. సరోజినికి స్టేజి బొత్తిగా కొత్త కాదు. ఇదివరకు రెండు మూడు సార్లు చిన్న పాత్రలు వేసింది.

సరోజిని వెంటనే ఒప్పుకుంది.

"ఏం భాయ్! ఏమిటి నీ అభిప్రాయం?" అన్నాడు శాస్త్రి తిరిగొస్తున్నప్పుడు.


"ఫస్టుగా సరిపోతుంది మధురవాణి పాత్రకు. మరి బుచ్చెమ్మో?" అన్నాడు ప్రసాదరావు.

"రామ్మూర్తి అని ఒకాయన ఉన్నాళ్ళే, కోటూవేసి చీరకట్టేస్తే, సరిగ్గా బుచ్చమ్మల్లేనే ఉంటాడని డైరెక్టరుగారే అనేశారు. అందమైన వితంతువు" అన్నాడు శాస్త్రి.

సరోజిని గురించి తన అభిప్రాయంమాత్రం చెప్పలేదు శాస్త్రి.

రిహార్సల్సులో సరోజిని, తన జీవితంలో వగానికి పైగా మెట్లెక్కిన సంగతి ప్రసాదరావుకు కొన్నాళ్ళవరకూ తెలీలేదు. అంతవరకూ ప్రసాదరావు ఆడవాళ్ళతో—ఈడొచ్చిన ఆడవాళ్ళతో ఆట్టే స్నేహం చేసినవాడు కాకపోవడంవల్ల, సరోజిని అతని జీవితంలో సులభంగానే అడుగు పెట్టగలిగింది. మొదట్లో అత నాట్టే పట్టించుకోలేదు. కాని రానురాను ఒకవిధమైన అనుమానం కలగసాగింది.

స్వతహాగా సరోజిని అందరికన్నా ఆకర్షణ శక్తి ఎక్కువగా ఉన్న మనిషి. ఈ ఆకర్షణ శక్తి శాస్త్రికి ఇదివరకే ఏమాత్రమో తగిలిందని ప్రసాదరావు సులభంగానే గ్రహించాడు. ఆ 'వ్యవహారం' జోలికిపోవడం మర్యాదకాదనుకున్న ప్రసాదరావుకు సరోజినే స్వయంగా తనకు దగ్గర పడుతున్నట్టు సందేహం కలిగింది.



వెయ్యి స్తంభాల గుడి (హనుమకొండ)

ఫోటో—కె. సత్యవతి (విజయవాడ)

ఒకసారి రిహార్సల్, ఒక సెలవు రోజున ఉదయం తొమ్మిదింటికి ఏర్పాటయింది. ఒక గంట ముందు ప్రసాదరావు కలలో కూడా అనుకోని పని జరిగింది.

సరోజిని సరాసరి ప్రసాదరావు గదిలోనికి ప్రవేశించింది.

"నువిట్లా నోటీసివ్వకుండా వస్తావని నే ననుకోలేదు" అన్నాడు ప్రసాదరావు—ఒకసారి వీధిగుమ్మంనుంచి, మరోసారి కిటికీనుంచి బయటకు చూసి.

"ఏం రాకూడదా?" అన్నది సరోజిని అతని కంగారుకు ఆశ్చర్యపడి.

"వస్తావని అనుకోలేదన్నానుగాని రాకూడదన్లేదు. తెలుగువాళ్ళెవరేనా ఈ దగ్గర్లో ఎదురైనారా?" అన్నాడు ప్రసాదరావు అనుమానంగా.

"అట్లా భయందేనికి? నేను దొంగతనం చేయటానికి రావడంలేదే!" అన్నది సరోజిని నవ్వుతూ.

"చూసినవాళ్ళకు ఏ అనుమానమైనా కలగచ్చు—చెప్పలేం" అన్నాడు ప్రసాదరావు.

గదిలో పరుపు పరచివున్న నులకమంచం, కూర్చునేందుకు రెండు 'మోడాలు', వెదురుతో అల్లిన ఒక టేబులూ, దానిమీద మూడు నాలుగు పుస్తకాలూ, రెండు మూడు పత్రికలూ, కిటికీలో చిన్న అద్దం, టాయిలెట్ సామగ్రి, మంచం కింద ఒక సూటుకేసూ, గోడకు ఒక పక్కన చిలక్కొయ్యా, దానికి వేలాడుతూ బుష్ షర్టులూ, ఒక మేకుకు వేలాడుతున్న ట్రావెలింగ్ ప్లాస్టిక్ బ్యాగ్, గదిలో ఒక మూల సురాయి, దానిపైన గ్లాసు.

"ఇవ్వాళ మిమ్మల్ని ఒక ముఖ్యమైన విషయం అడగటానికొచ్చాను" అన్నది సరోజిని ఒక మోడాలాగి కూర్చొని.

తలదువ్వుకొంటున్న ప్రసాదరావు గుండెలో ఏ మూలో ఒక విమానం రొదచేసినట్టయింది.

ఒంటరిగా ఒక ఆడమనిషి, తన సమక్షంలో, తన గదిలో ఇట్లా ఉండడం ఇదే మొదటిసారి. దీనికి తాను ముందుగా సిద్ధపడివుంటే, ఈ కొద్దిపాటి బెదురూ ఉండేది కాదేమో అనుకున్నాడతను.

"కోపం రాదుకదా?" అన్నది సరోజిని.

"వస్తే ఇంకొకరిమీద కోపం రావటం నాకిది మొదటిసారి అవుతుంది. ఇంతవరకూ నాకు, నామీదే అనేకసార్లు కోపం వచ్చింది. ఏం చేయగలిగాను?"

"ఏమో! మిమ్మల్ని మీరు తన్నుకొని ఉండాలి."

ప్రసాదరావు నవ్వాడు.

"నిన్ను తన్నన్లే, తన్నినా నువ్వూరుకుంటావా ఏమిటి?"

"మీవంటివారు తన్నితే బుద్ధొచ్చేట్టు చేయటానికి తన్నుతారు. తప్పేం?"

"నాలో ఉన్న గొప్పేమిటో? అయినా నీకీ సంగతి ఎట్లా తెలిసిందని?"

ఈ ధోరణి ఎటుపోతున్నదీ ప్రసాదరావుకు అంతుపట్టలేదు. సరోజిని మాటలలో ఏదైనా ధ్వని ఉందేమో అనే అనుమానం కలిగిం దతనికి.

"మగవాళ్ళకు తెలీదేమోకాని, ఆడవాళ్ళకు తెలుస్తుంది అన్నం ఉడికిందీ, లేనిదీ ఒక్క మెతుకు పట్టిచూస్తే!" అన్నది సరోజిని.

అయిదు నిమిషాలు గడవనిచ్చి,

"ఇంతకూ ఏమిటడగదలచుకున్నావు సరోజినీ"

అన్నాడు ప్రసాదరావు.

"మీ రింకా ఎందుకు పెళ్లి చేసుకోలేదు?" అన్నది సరోజిని అతని ముఖంలోకి చూస్తూ.

"పెళ్లా? నేనా?"

ప్రసాదరావుకు, ఇది సరోజిని రాకతోనే పొల్పతగ్గ ప్రశ్న. ఆవిడ రావడం, ఈ ప్రశ్న వేయడం, రెండూ హఠాత్తుగా తన సంసిద్ధత లేకుండానే సంభవించినవి.

"పెళ్లే. మీరే!" అన్నది సరోజిని ఒకసారి నవ్వి.

"ఈ ప్రశ్న నువ్వు ఎందుకు వేశావో నా అంతట నేనే అర్థం చేసుకోవాలనేనా ఉద్దేశ్యం?" అన్నాడు ప్రసాదరావు.

"నా ఉద్దేశ్యం అడగండి చెబుతాను అని అనలేదు నేను. నా ప్రశ్నకు జవాబివ్వటం ఇష్టంలేకుంటే బలవంతం చేయను" అన్నది సరోజిని.

"ఇష్టం లేకపోవట మేం ఖర్మం? పిల్ల కుదరక్కర్లా? పెళ్లి అనగానే సరా? తీరా పిల్ల తటస్థపడితే, దానికి నేను నచ్చక్కర్లా?" అన్నాడు ప్రసాదరావు.

"ఏం చమత్కారం! పిల్ల మీకు నచ్చాలని మీ భావం! అర్థమయింది. నిజమే మరి!" అన్నది సరోజిని నవ్వి.

"పిల్ల నాకు నచ్చడంకన్నా, నేను పిల్లకు నచ్చటం, నాకు ముఖ్యం—"

"ఏ పిల్లకు!"

"నన్ను పెళ్లిచేసుకోబోయే పిల్లకు."

"ఇంతకూ ఎవరూ కుదరలేదా?"

"సమయం-రావద్దా?"

## తప్పటడుగు

"మీకు జాతకాల్లోనూ, తత్వంలోనూ నమ్మకం ఉన్నట్టుంది!"

"నీకు లేదా? ఈ దేశంలో నమ్మకం లేనివా డెవడైనా చెప్పు? కమ్యూనిస్టుల మనుకుంటున్న వారు కూడా జాతకాలు చూపించుకోవడంలేదా?"

"పోనీ ఆ సమయం ఇంకా మీకు రాలేదా?"

"నువ్విప్పుడడిగితే నాకా అనుమానం కలుగుతూంది స్మీ! చెప్పొద్దూ?"

"ఆవి డెవరో నేను తెలుసుకోవచ్చా?"

"తెలీకుండా పోతుందా ఏం? ఇంతకూ నన్నిట్లా వేధించాలనే బుద్ధెందుకు పుట్టిందీ?"

"ఆవి డెవరో తెలిస్తే, ఆవిడకు బహుశా తెలీని సత్యాన్ని చెపుదామని!"

"ఏమిటా సత్యం?"

"ఆవిడ చాలా అదృష్టవంతురాలని?"

"అలా చెపితే నువ్వు తప్పటడుగు వేసినట్టవుతుంది. నా భవిష్యత్తేమిటో నాకు తెలీదు. ఈ మనస్సుకు ఏమి తిప్పలు వస్తాయోచెప్పలేం?"

"మీ మనస్సుకు తిప్పలేవీ రావనే నమ్మకం నా కుంది మీకు లేకున్నా. ఇక మీ భవిష్యత్తా? మీకు మంచి ఉద్యోగం కాబోతున్నదని శాస్త్రిగారి ద్వారా విన్నాను—మీరు చెప్పకపోయినా."

"ఏదీ, నాతో అతనా ముక్క చెప్పందే?"

అంతకు ముందు రోజు ప్రసాదరావు గురించి సరోజిని శాస్త్రిని అనేక ప్రశ్నలు వేసింది. ప్రసాదరావుకు మంచి నౌకరీ, తన పలుకుబడి మూలంగానే కాబోతున్నట్టు శాస్త్రి చెప్పడం నిజమే. తనకు మంచి పలుకుబడి ఉందని చెప్పుకోవడానికి ఆ మాట అన్నాడు. అందులో నిజమెంతో సరోజినికి తెలీదు. ప్రసాదరావుతో మాత్రం శాస్త్రి ఆ మాటేదీ అవలేదు.

"అయితే ఆయన చెప్పింది నిజం కాదన్న మాట" అన్నది సరోజిని.

"అతను పచ్చి అబద్ధాలు చెప్పడేమో కాని, కొంతవరకు ఏదైనా కల్పించే బుద్ధి అతనికి లేకపోలేదు."

"పోన్లెండి. మీకు ఎప్పటికేనా మంచి ఉద్యోగం అవుతుందనే నమ్మకం నాకుంటే చాలదా?"

సరోజిని ధోరణిలో ఏదో ధ్వని ఉందనే నమ్మకం కుదిరింది ప్రసాదరావుకు. సరోజిని మనస్సు గ్రహించటానికి ఇంతకన్నా ఎక్కువ అనవసరం. కాని, శాస్త్రికి ఈ పిల్లమీద ఇది వరకే 'గురి' ఏర్పడిందనే అనుమానం తనకు వెనకెప్పుడో కలిగింది. ఒకవేళ సరోజిని, తన చెల్లెల్ని దృష్టిలో ఉంచుకొని తనతో ఇట్లా మాట్లాడుతున్నదేమో? శాస్త్రి గురించి సరోజిని అభిప్రాయమేమిటో తెలుసుకొంటేనేగాని దీని అంతు చిక్కదు.

"పద. రిహార్సల్స్‌కు టైమైనట్టుంది" అన్నాడు ప్రసాదరావు.

(సశేషం)


లిటిల్స్
ఓరియంటల్
బామ్

డెబ్బయి అయిదు సంవత్సరాలకుపైగా, సమస్తమైన జలుబులను, పోటులను, నొప్పులను నివారించుటలో నమ్మకమైన మందు



లిటిల్స్ ఓరియంటల్ బామ్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్,
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2.

LOB-309

# తప్పటడుగు

## (క్రిందటి సంచిక తరువాయి)

**నాటకం**, నాటక సమితి కార్యక్రమం పూర్తయిన కొద్ది రోజులకే ప్రసాదరావు ఉద్యోగ కాలపరిమితి కూడా పూర్తయింది. ఫలానా రోజునుంచీ మళ్లీ తను నిరుద్యోగి అని తెలిసి ఉన్నప్పటికీ ప్రసాదరావు ఆ రోజు రాగానే, దిగులుతో నిద్ర లేచాడు. మరో అరగంటకల్లా శాస్త్రి ప్రత్యక్షమైనాడు.

"ఏం గురూ?" అన్నాడు శాస్త్రి.

"ఏముందీ? నేను మరి ఈ రోజునుంచి ఆఫీసుకు పోనక్కర్లేదుగా!" అన్నాడు ప్రసాదరావు.

"దాని సిగ్గోసిరి. నీకు ఈ రోజునే మరో ఉద్యోగానికి ఇంటర్‌వ్యూ ఉత్తరం రాబోతున్నదని చెప్పటాని కొచ్చాను" అన్నాడు శాస్త్రి.

"జోస్యం చెబుతున్నావా?"

"పరోక్షంగా సంగతులన్నీ తెలుసుకొని, చెప్పే జోస్యం. మరి తిరుగులేకుండా ఫలిస్తుంది. మొన్న నాటకంలో కనిపించారే, ఆ తెలుగరవాయన, రామచంద్రన్ గారు?..."

"అవునవును—"

"రేపు ఆఫీసులో ఆయన్ను నువ్వు కలవాలి. అంతే. ఇంకేమీ నన్నడగద్దు—" అంటూ శాస్త్రి వెళ్లబోయినాడు.

"ఉండు ఎక్కడికప్పుడే ? నీకెట్లా తెలిసిందీసంగతి?" అన్నాడు ప్రసాదరావు, శాస్త్రి చేయి పట్టుకొని.

"ఆ శ్నే ప్రశ్నించవద్దన్నాను గదా? నాపాట్లేవో నేను పడ్డాను. ఇప్పుడింకో పాటు పడాలి. అర్జంటు. వస్తా" అన్నాడు శాస్త్రి.

"ఎక్కడికా హడావిడి? కాస్త కాఫీ తాగుదాం ఉండు."

శాస్త్రి మొదట కాస్త తటపటాయించాడు.

"ఎక్కడికని అడిగాక చెప్పకపోతే కార్యం చెడుతుందని నా నమ్మకం. ఈవేళ ఉదయం ఏదో అవసరంగా మాట్లాడాలనీ, ఇంటికి రమ్మనీ రాసింది సరోజిని. మళ్లీ కలుస్తాగా సాయంకాలం?" అన్నాడు శాస్త్రి.

"అలాగా!" అన్నాడు ప్రసాదరావు. ఇంకా ఏదో అడగాలనుకున్నాడు. కాని, చప్పున ఏ మడగాలో తట్టలేదు.

శాస్త్రి వెళ్లిపోయిన తర్వాత, ఆ రోజున అతను చెప్పిన ఉత్తరం పోస్టులో వచ్చి అందే వరకూ ప్రసాదరావు మనసు "కాస్మోనాట్"ల్లే ఈ ప్రపంచాన్ని అనేకసార్లు పరిభ్రమించి, ఉత్తరంతోపాటు తిరిగి సురక్షితంగానే చేరుకుంది.

మర్నాటి ఉదయం ప్రసాదరావు ఉత్తరం చేత పుచ్చుకొని పదకొండు గంటల వేళప్పుడు రామచంద్రన్ గారి ఆఫీసు గదిలోకి అడుగు పెట్టాడు.

"రండి. రండి. మీకోరకుదా చూస్తుంటేని. నిండా సంతోషం. కూర్చోండి. మన శాస్త్రి అంతా చెప్పినాడు" అన్నారు రామచంద్రన్‌గారు.

"మిమ్మల్ని కలుసుకోమనడం తప్ప శాస్త్రి నాతో ఇంకేమీ చెప్పలేదండీ" అన్నాడు ప్రసాదరావు కూర్చుంటూ.

"మీరుదా ముందుగా చెప్పకపోతిరి. ఆరు మాసాంలో మంచి ప్రమోషన్ ఉండును. నా ఆఫీస్‌లోనే దా ఈ జాబ్. జాయినింగ్‌రిపోర్టు నా 'పియ్యే'కి ఇచ్చివేయండి. వాడుదా మీకంతా చెప్తడు."

"చాలా కృతజ్ఞుణ్ణి" అంటూ ప్రసాదరావు లేవబోయినాడు.

## పన్యాల రంగనాథరావు

"చూడండి సాయంకాలం అట్లా ఇంటికి రండి టీకి" అన్నారు రామచంద్రన్ గారు.

మధ్యాహ్నం రెండింటికి రామచంద్రన్‌గారి 'పియ్యే' ప్రసాదరావు దగ్గరకొచ్చి, "సార్, మీకు ఫోన్‌కాల్" అన్నాడు. తను అనుకున్నట్టు శాస్త్రే ఫోను చేశాడు.

"ఏం గురూ! చేరావా?"

"చేరాగానీ, నీ మీద నాకు కాస్త కోపంగా ఉంది" అన్నాడు ప్రసాదరావు ఫోనులో.

"అది సర్లే. మరి సాయంకాలం అట్రానా, మాట్లాడుకోవాలి?"

"రామచంద్రన్‌గారు సాయంకాలం టీకి రమ్మన్నారు ఎట్లా?"

"ఏమిటి? అప్పుడే?"

ప్రసాదరావుకు శాస్త్రి ఏదో తెలిసి దాస్తున్నాడనిపించింది.

"అంటే?"

"ఏం లేదులే. కంగారెత్తకు. కంగ్రాట్యులేషన్స్!"

కట్.

ప్రసాదరావుకు ఏమీ అర్థం కాలేదు. అర్థం కాని ముఖంతోనే సాయంకాలం తన గదికొచ్చి దుస్తులు మార్చుకొని రామచంద్రన్‌గారి బసకు వెళ్లాడు.

రామచంద్రన్‌గారు గదిలో మంచంపైన పడుకొని ఉన్నాడు. అతని 'పియ్యే' పక్కనే నిలబడి ఉన్నాడు.

"రండి రండి, ఏమీ లేదు. అప్పుడప్పుడు 'హార్ట్'లో పెయిన్ వచ్చును. మిమ్మల్ని టీకిదా రమ్మంటిని. సడెన్‌గా నాకు ఈ పెయిన్. గోపాలన్! టీ కొండాప్పా!" అన్నారు రామచంద్రన్ గారు.

కొన్నాళ్లబట్టి ఆయన్ను ఈ గుండెజబ్బు పీడిస్తున్నది. ఇంతలో మరేమీ ఫరవాలేదన్నారు డాక్టర్లు.

"నాకుదా వేరే ఫ్లాట్ చిక్కింది. నెక్స్ట్ వీక్ మారవలె" అన్నారు రామచంద్రన్ గారు.

"కుటుంబం వస్తారనుకుంటాను."

"రావలె. అన్నీ ప్రాబ్లెమ్స్. నాకు ముగ్గురు డాటర్స్. ఒక సన్."

టీ వచ్చింది.

"డాటర్స్‌లో ఇద్దరికి మ్యారేజ్ కావలె."

ప్రసాదరావు టీ పుచ్చుకుంటూ వింటున్నాడు.

"డాక్టరుకు ఫోను చేయించారా?" అన్నాడు ప్రసాదరావు.

"ఇప్పుడే వస్తడు" అని రామచంద్రన్ గారు ఒక్కసారి కండ్లు మూసుకున్నారు బాధ ఎక్కువై.

డాక్టరొచ్చి మూడు రోజులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పి మందురాసి ఇచ్చాడు. వెంటనే ఒక ఇంజక్షను ఇచ్చాడు. రామచంద్రన్‌గారికి కాస్త తెరిపిచ్చింది.

"ఇది మామూలుదా. ఇట్లానే వచ్చును" అన్నా రాయన.

ప్రసాదరావుకు మాత్రం ఆ క్షణంలోనే ఆయన గుటుక్కుమంటాడనే భయం పట్టుకుంది.

రామచంద్రన్‌గారు కొద్దిగా నింపాదిగా ఉండటంచూసి ప్రసాదరావు లేచాడు.

"అవసరమైతే కబురుచేయండి. వస్తాను" అని చెప్పి వెళ్లిపోయినాడు.

ప్రసాదరావు సరాసరి శాస్త్రి గదికి వెళ్లాడు. కాని శాస్త్రి లేడు.

ఆ రాత్రి తను పడుకుందా మనుకుంటూ ఉండగా అవతరించాడు శాస్త్రి.

"ఏం భాయ్! ఏం కబుర్లు?" అన్నాడు శాస్త్రి.

"ఇందాక నీ గదికొచ్చాను. లేవు" అన్నాడు ప్రసాదరావు.

"మనకు వెయ్యి వ్యాపకాలు. ఏమంటారు

**జరిగిన కథ**

*ఆరునెలల నౌఖరీ కోసం ఢిల్లీ వెళ్ళాడు ప్రసాదరావు. సరోజిని ప్రసాదరావు గదికి వెళ్ళి, అతని పట్ల తనకు ఉన్న అభిప్రాయాన్ని మాచాయగా వెల్లడిచేసింది.*



సాయంకాలే

ఫోటో—లజపత్ రాయ్ (డేరాడూన్)

రామచంద్రన్ గారు?'' అన్నాడు శాస్త్రి.

''ఆయన పుటుక్కున చస్తాడనుకున్నాను ఈ సాయంకాలం! చిన్న హార్ట్ ఎటాక్ ఉన్నట్టుంది!''

''ఆ... ఇప్పుడప్పుడే ఎక్కడ? ఇంకా చాలా టైం పడుతుంది. ఈమధ్య ఒకటి రెండు సార్లిట్లానే అవుతే, నేనున్నాను దగ్గర. మళ్లీ లేచి తిరిగేస్తాడు... మరేం భయం లేదు.''

''సరేగాని, అతనిచేత నాకీ నౌకరీ ఇప్పించటంలో ఏదో రహస్యం ఉంది. అది నువ్వు దాస్తున్నావు. అంతేనా?''

శాస్త్రి నవ్వాడు.

''ఇందులో రహస్యమేం లేదు భాయ్! అతనికి ఎదిగిన కూతుళ్లున్నారు. నీమీద అతను కన్నువేశాడని గ్రహించాను. అతనిది నలుగురికి సునాయాసంగా ఉద్యోగా లిప్పించే పెద్ద పదవి. ఇంతకన్నా గొప్ప అవకాశం ఉండదనుకున్నాను. నీ సంగతి చెప్పాను. ఉద్యోగం ఇస్తా నన్నాడు. అతని కూతుళ్లలో ఒకతెను నిన్ను బహుశా చేసుకోమంటాడు. నచ్చితే చేసుకో. బాగుపడి పోతావు. బాగా పైకి తన్నుకొచ్చేస్తావు. ఇంతకన్నా నేను నీకు చేయగలిగే గొప్ప ఉపకారం మరోటి ఉండదని ఈ పని చేశాను. ఇందుకు నన్ను నువు తిట్టినా పడటానికి సిద్ధం'' అన్నాడు శాస్త్రి.

ప్రసాదరావు నోట మాట రాలేదు. ఈ శాస్త్రి రాను రాను తనకు పూర్తిగా అర్థంకాకుండా పోతున్నా డనిపించింది. ఎక్కడో ఎవరో తప్పటడుగులు వేస్తున్నట్టుంది. మనం చేసే కొన్ని పనుల మంచిచెడ్డలు మనం అంచనావేసే పద్ధతిలో ఉండవు. కాని ఆ పనులు చేసేటప్పుడు మన కున్న విజ్ఞాయిటీని నమ్ముకుని, ఆ మంచి చెడ్డలను స్వీకరిస్తాం. జీవితంలో ఒక్కసారైనా తప్పటడుగువేయకుండా ఉండడం ఎవరి తరమూ కాదు. అనేకసార్లు తప్పటడుగులు వేయడం అంత పాపిష్టి పని కూడా కాదు. కావాలని ఎవరూ వేయరు. వేసే ముందు ఇది తప్పటడుగు కాదు కదా అని ఒకసారి అనుకోవటంలో తప్పులేదు.

* * * *

ప్రసాదరావు కొత్త ఉద్యోగంలో చేరి నెల రోజులయింది. ఈ మధ్య వారం పదిరోజులైనా శాస్త్రి జాడ లేదు. ఏమైనాడో? తనతో చెప్పకుండా ఎక్కడికి పోయినాడో? అర్థం కాలేదు. అటు రామచంద్రన్ గారు ఇల్లు మారినప్పటి నుంచీ మంచం పట్టేశారు. గుండెనొప్పి తగ్గిపోతే ఈసారి టైఫాయిడ్ అని తేల్చాడు డాక్టరు. ప్రసాదరావు తప్పనిసరిగా రామచంద్రన్ గారిని కనిపెట్టి ఉండవలసిన అవసరం ఏర్పడింది.

''ప్రసాదూ! నువు ఈ ఇంటనే ఉండుపో!'' అన్నారు రామచంద్రన్‌గారు. ఆ స్థితిలో కాదనలేక, ప్రసాదరావు తన గది విడిచిపెట్టేసి రామచంద్రన్‌గారి ఇంటిలో ఒక గదిలోకి తన మకాం మార్చేశాడు. రామచంద్రన్‌గారి 'పియ్యేను', 'పియ్యే' చేయవలసిన పనులు తప్ప ఇంకొకటి చేయనునటం భావ్యం కాదు. జబ్బుతో ఉన్న ఆ పెద్దమనిషికి తను తప్ప వేరే దిక్కులేదు.

ఒకనాటి సాయంకాలం ప్రసాదరావు, ఎన్నడూ ఒంటరిగా వెళ్లనివాడు, ఈసారి ఒంటరిగానే సరోజిని ఇంటికి వెళ్లాడు, శాస్త్రిగురించి తెలుసుకోడానికి. సరోజిని ఇంట్లో లేదు. ఇంట్లో తల్లితప్ప ఎవరూ లేరు.

''ఇస్కూలు పిల్లల్ని తీసుకొని ఏదో ఊరెళ్లి రావాలిట నాయనా. ఇంకో వారం రోజుల్లో రావాలి సరోజిని. పిల్లలు బజారువేపు వెళ్లినట్టున్నారు'' అన్నది సరోజిని తల్లి.

ప్రసాదరావుకు లేనిపోని అనుమానాలు కలిగినై. ఈ శాస్త్రిగాడు సరోజినిని ఎక్కడికైనా ఎగవేసుకు పోలేదుగదా!

ఆరోగ్యానికి మించిన వరం లేదు. సంతృప్తికి మించిన భాగ్యం లేదు. అనుబంధా లన్నిటిలో నమ్మకమే శ్రేష్ఠమైనది. నిర్వాణమే మహానందము.

ఇంకొక వారం గడిచింది. ఈ వారం రోజులలో రామచంద్రన్ గారి పరిస్థితి కొద్దిగా విషమించినట్టయింది. ప్రసాదరావు దీక్షగా అతనికి సేవచేయడం ప్రారంభించాడు. రాత్రులు నిద్ర కూడా మానుకొని అతని మంచం పక్కనే కూర్చొనే వాడు. రామచంద్రన్ గారు తిరిగి కళ్లు తెరచి చూసే వరకు ప్రసాదరావు మరొక ఆలోచన పెట్టుకోలేదు. అతని చూపులో గల కృతజ్ఞతాభావాన్ని ప్రసాదరావు గ్రహించాడు. గండం గడిచిపోయింది. ఇక ఫరవాలేదనుకున్నాడు ప్రసాదరావు.

ప్రసాదరావు ఆఫీసులో ఉండగా అతనికి టెలిఫోను పిలుపొచ్చింది.

''నేనే గురూ! నీతో చెప్పకుండా ఈమధ్య మద్రాసు వెళ్లొచ్చాను.''

''అలాగా! ఎప్పుడొచ్చావు?''

''ఇప్పుడే. రెడ్డిగారు పిలిచారు. అర్జంటుగా

పోయినాను. మళ్లీ కొద్దికాలంలోనే పోవలసి ఉంటుంది. నువు మకాం మార్చావుటగా! శుభం! రాత్రికి కలుస్తా, అన్నట్టు—ఆయన కెట్లా ఉంది?''

''ఫరవాలేదు. నింపాదిగా ఉంది.''

''వస్తా మరి. నీకో శుభవార్త చెప్తాలె. రాత్రి....''

సరోజిని గురించి అడుగుదామా అనుకుంటూండగానే శాస్త్రి ఫోను పెట్టేశాడు.

ఆ రాత్రి శాస్త్రి భోజనంచేసి ప్రసాదరావు దగ్గరకొచ్చాడు. అప్పటికి రామచంద్రన్‌గారు నిద్రపోతున్నారు.

''ఏం భాయ్! ఎట్లాఉంది?''

''క్రమేపీ నార్మల్‌కి వస్తోంది. గండం గడిచి పోయింది.''

''ఇక్కడికి మారిపోవడం, చాలా మంచిపని చేశావు. లేకుంటే ఈయన—''మిగతాది అభినయంతో పూర్తి చేశాడు.

''ఏం చేసుకొచ్చావు మద్రాసులో?'' అన్నాడు ప్రసాదరావు.

''అది తరువాత చెప్తాలే. ఇప్పుడు నీకో శుభవార్త చెప్పటానికొచ్చాను.''

''ఏమిటది?''

''నువు తప్పక సంతోషిస్తావనే నా నమ్మకం. సరోజినీ నేనూ పెళ్లి చేసుకున్నాం!''

''అదేమిటి? ఎప్పుడు? ఎక్కడ?'' ప్రసాదరావుకు మతిపోయినట్టయింది.

''ఈ మధ్యనే ఇద్దరం మద్రాసువెళ్లాం.''

''ఆవిడేదో స్టూడెంట్సు టూరుమీద వెళ్లిందటగా? వాళ్లమ్మ చెప్పింది.''

''అదేలే. ఇంట్లో మరి ఏదో ఒకటి చెప్పాలిగా!''

''దీనికింత రహస్యం, అబద్ధం ఎందుకూ? ఆవిడ చెల్లెళ్లకూ తమ్ముడికీ కూడా తెలీదా?''

''తెలీకుండా బందోబస్తు జరిపించాం.''

''మరి నీ మొదటి పెళ్లాం?''

''మొదటాలేదు. పెళ్లాంలేదు. అదంతా ఎందుకులే ఇప్పుడు!''

ప్రసాదరావు అనుకున్నంతాఅయింది. సరోజినిని శాస్త్రి కొద్ది రోజులపాటు ఎక్కడికో లేవదీసుకు పోయాడు. అంతవరకూ నిజం. శాస్త్రి చెప్పిన మిగతాదంతా అబద్ధం అని తోచింది ప్రసాదరావుకు.

''నువ్వు మంచిపనే చేశావని పూర్తిగా నమ్మి ఈ పని చేసినట్టయితే, ఇందుకు నేను సంతోషిస్తున్నాను'' అన్నాడు ప్రసాదరావు.

''ఇప్పటికిది మంచి పనిగానే తోచింది భాయ్!'' అన్నాడు శాస్త్రి.

శాస్త్రిని పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంగల సరోజిని, తనతో ఆ రోజున, అటువంటి సంభాషణ ఎందుకు జరిపిందో ప్రసాదరావుకు అర్థం కాలేదు. తన అభిప్రాయమేమిటో తెలుసుకోవడానికే సరోజిని ఆ విధంగా తనతో మాట్లాడిందనుకుంటే, ఆవిడకు అటో ఇటో తేల్చి చెప్పక పోవడంతో తనే పెద్ద తప్పటడుగు వేశాడన్న మాట. అందు కిప్పుడు విచారించి లాభం లేదు. చేతులెప్పుడో కాలినై. ఇక ఆకులు దేనికి? ఇన్నాళ్లూ తను సరోజినిని గురించి ఏవో కొన్ని కలలు కన్నట్టు ఇప్పుడు తట్టింది ప్రసాదరావుకు. ఇక ముందు ఈ కలలకు అర్థం లేదు. శాస్త్రి, తనను రామచంద్రన్ గారికి అప్పగించటంలో సరోజిని విషయంలో 'లైన్ క్లియర్' చేసుకున్నా డనిపించింది ప్రసాదరావుకు. ఇక సరోజినిని కలియడంలో కూడా అర్థం లేదు.



దిల్వారా ఆలయంలో శిల్పం (మౌంట్ అబూ)

ఫోటో—ఎ. ఆర్. పార్వతి (బొంబాయి-4)

• • •

రామచంద్రన్ గారు కోలుకున్నారు. అతని కుటుంబం కూడా వచ్చింది. ఆయన తన అస్వస్థతను గురించి ముందుగా భార్యా పిల్లలకు ఉత్తరం రాయించకపోవడానికి కారణం లేకపోలేదు. అతని పిల్లలకు పరీక్షల రోజులు. చదువులు పాడవుతై. వాళ్లొస్తే అనవసరంగా బెంగలతో రోజులు గడపడం తప్ప వేరేమీ ఉండదు. పిల్లల కోసం తండ్రి, ఈ మాత్రం త్యాగం చేయటంలో తప్పు లేదు.

రామచంద్రన్ గారు ప్రసాదరావు గురించి భార్యకూ పిల్లలకూ అంతా చెప్పి, అతని గుణగణాలు పొగిడి ఎత్తేశాడు. పెద్దకూతురు జానకి. ఇరవైయేళ్లుంటై. ఏమంత అనాకారి కాదు. ప్రతి ఆడపిల్లకూ వయసొస్తే, ఏదో కొంత ఆకర్షణ కూడా ఉంటుంది మరి. బియ్యేచదివింది. కలుపుగోలుగానే ఉంటుంది.


జానకికి ప్రసాదరావును ''చూడ బుద్ధి'' అయింది!

రామచంద్రన్ గారికి కావలసిందే అది!

ప్రసాదరావు తన పెళ్లి గురించి తను స్వయంగా ఆలోచన చేయడం పూర్తిగా మాని వేశాడు. ఆపని అంతా రామచంద్రన్ గారే చేసేస్తున్నారు. ప్రసాదరావు అన్ననూ, తల్లినీ, వదిననూ, పిల్లల్నీ ఆయనే టెలిగ్రాములమీద పిలిపించాడు.

ప్రసాదరావుకు జానకితో పెళ్లి, చాలా వైభవంగానే జరిగింది.

అనుకోకుండా కుదిరిన ఈ గొప్ప సంబంధానికి ప్రసాదరావు తల్లీ, అన్నా, వదినా ఎంత తృప్తిపడాలో అంత తృప్తి పడి ఆనందించారు. ఇటువంటి తృప్తీ, ఆనందమూ తనకు కలిగిందీ లేనిదీ తేల్చుకోలేని వ్యక్తి ఒక్క ప్రసాదరావే. ఎవరి చేతులలోనో తానొక కీలుబొమ్మ అయినట్టు



చిత్రం—మోహన్‌రామ్ (వెల్లూరు)

తోచింది. నిజానికి తనను ఏ విషయంలోనూ ఎవరూ బలవంతం చేయలేదు. అంతా దైవికంగా జరిగింది. ఇందులో తను చేయగలిగిం దేమీలేదు. అట్లా జరగాలని రాసిపెట్టి ఉన్నట్లుగా జరిగింది. అంతే.

తనూ జానకీ మాట్లాడుకోవడానికి ఇద్దరికీ తెలిసిన భాష ఒక్కటే—ఇంగ్లీషు!

"నన్ను చేసుకున్నందుకు మీరు విచారించటం లేదుకదా?" అన్నది జానకి.

"దేనికి విచారం? నా అదృష్టానికి సంతోషిస్తున్నాను!" అన్నాడు ప్రసాదరావు. అతనేదో దాస్తున్నట్టు జానకి పసికట్టింది. కాని లోతుగా అర్థంచేసుకొనే జ్ఞానం ఇంకా రాలేదు ఆ పిల్లకు. దేనికైనా కొంత అనుభవం కూడా తోడ్పడాలికదా!

ప్రసాదరావు పెళ్లికి శాస్త్రి వచ్చాడు. వెనక నాటకంలో వేసిన వాళ్లంతా వచ్చారు. సరోజిని మటుకు రాలేదు. ఆవిడకు జ్వరంగా ఉందన్నాడు శాస్త్రి.

ఇది జరిగి ఇంకా నెల్లాళ్ళు కాలేదుపాపం. రామచంద్రన్ గారు ఈ సారి గుండెపోటువెక్కువై హఠాత్తుగా పోయినారు. కుటుంబం సంగతి ఏమిటో తేల్చకుండా అట్లా చనిపోతాడని ప్రసాదరావు అనుకోలేదు. అతనేమిటి? ఎవరూ అనుకోలేదు. ఇప్పుడీ భారమంతా ప్రసాదరావు నెత్తిన పడింది. అయితే రామచంద్రన్ గారు చనిపోవటానికి ముందే ఒక మంచిపని చేసివుంచారు. ప్రసాదరావుకు ఒక పెద్ద ఉద్యోగంలోనికి ప్రమోషను రికమెండు చేశారు. ఆయన పోయిన తర్వాత ఆ ప్రమోషన్ కూడా వచ్చేసింది.

ప్రసాదరావు వేరే ఇల్లు తీసుకుని కాపరం పెట్టాడు. అత్తగారూ, మరదళ్లూ, మరిదీ వీరిభారం తనపైనే వేసుకున్నాడు. ముందున్న జీవితం ఏ నడకతో ఏ పద్ధతిలో ఎదురైతే ఆ పద్ధతిలోనే దాన్ని స్వీకరించడం మంచిది. దానికి ఎదురీత ఈదే స్వభావం ప్రసాదరావులో లేదు.

ప్రసాదరావు తన జీవితాన్ని పూర్తిగా ఆమోదించుకున్నాడు.

# తప్పటడుగు

"ఏమండోయ్! ప్రసాదరావుగారూ! శాస్త్రి కనపట్టంలే. మరి మీరే సారథ్యం వహించాలి. ఈసారి 'ఆంధ్రా డే' అంటూ తలపెట్టాం. నాటకం వేయాలి" అన్నాడు వెనక కన్యాశుల్కంలో బుచ్చెమ్మగారు—రామ్మూర్తి!

"మళ్లీ ఏం నాటకం!"

"ఏదో వేద్దాం. మీరాలోచించండి. సరోజిని గారు ఒప్పుకున్నారు. శాస్త్రే కనపట్టంలా."

"ఎక్కడికి వెళ్లాడు? సరోజినిని అడగలేదా?"

"వారికేమీ తెలీదుట. మరి మీరు ఊఁ అంటే మిగతా ఏర్పాట్లు నేను చూసుకుంటాను."

"సరే మళ్లీ రేపు కలుద్దాం" అంటూ ప్రసాదరావు లేచాడు.

అతను సరాసరి సరోజిని ఇంటికి పోయినాడు. సరోజిని ఇంట్లోనే ఉంది.

ప్రసాదరావును చాలాకాలానికి ఆమె మళ్లీ చూసింది. ప్రాణం లేచివచ్చినట్టయింది.

"ఏం సరోజినీ! శాస్త్రి ఎక్కడ?"

ఆమె వెంటనే జవాబివ్వలేదు.

"నీతో చెప్పకుండా పోయినాడా?"

"పది రోజులైంది. ఎక్కడా కనపడలేదు" అన్నది సరోజిని. ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది.

"ఇంట్లో ఎవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"అమ్మ వంటలో ఉంది.చెల్లెళ్లూ,తమ్ముడూ బయటకు వెళ్లారు. ఇక్కడ నేనూ మీరేఉన్నాం."

ప్రసాదరావుకు హఠాత్తుగా అనుమానం కలిగింది.

"శాస్త్రి నిన్ను పెళ్లిచేసుకున్నానని నాతో చెప్పాడు. నిజమేనా?"

"మీతో ఎప్పుడన్నారట్లా?" అన్నది సరోజిని ఆదుర్దాగా.

ప్రసాదరావుకు అంతా అర్థమయింది.

"అమధ్య ఒకసారి నువ్వూ, అతనూ కలిసి వెళ్లిన మాట నిజమేనా?"

"నిజమే. తప్పటడుగు వేసిన తరువాతగాని, అది తప్పటడుగని తెలీదు కదా! కానీ మేం పెళ్లి చేసుకోలేదు !"

"శాస్త్రి అబద్ధం చెప్పాడన్నమాట ! మరి, మరి, ఏం జరిగినట్టు!"

ఏం జరిగిందో సరోజిని చెప్పగలిగే విషయం కాదు. ప్రసాదరావుకు అర్థమయింది.

"ఈ శాస్త్రి ఇట్లాంటిపని ఎందుకు చేసినట్టు?"

సరోజిని మాట్లాడలేదు. ఆమె కంటివెంట నీళ్లు కారడం ప్రారంభించినై.

ప్రసాదరావు గుండెలో కట్టలు తెగి ప్రవాహం ఒకటి వచ్చింది. అతను ఉండలేకపోయినాడు. లేచి సరోజినిని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె కండ్లు తుడిచాడు. సరోజిని అభ్యంతరం చెప్పలేదు.

"జీవితంలో తప్పటడుగులు వేశాం సరోజినీ! ఈ భావం మొదట్లోనే పూర్తిగా గ్రహించుకోలేక పోయినాను. కొంతవరకూ శాస్త్రి మాటలు నమ్మి నిన్ను అన్యాయం చేశానుకుంటున్నాను. ఇక నీకు ఏ అన్యాయమూ జరగనివ్వను" అన్నాడు ప్రసాదరావు.

సరోజిని మాట్లాడలేదు.

* * * *

'ఆంధ్రా డే' ఉత్సవం నాటకంలో సరోజిని, ప్రసాదరావూ ముఖ్యపాత్రలు వేశారు. బాగా నటించారనే పేరుకూడా వచ్చింది.

"ఆ సరోజిని ఎవరండీ?" అన్నది జానకి, నాటకం రోజు రాత్రి.

"ఆవిడా! ఆవిడ నా స్నేహితురాలులే" అన్నాడు ప్రసాదరావు. అంతకుమించి ఏమీ చెప్పలేదు.

* * * *

ప్రసాదరావుకు ఇప్పుడు అప్పుడప్పుడు బాధించే ప్రశ్న ఒకటే ఉంది.

"జీవితంలో వేసిన తప్పటడుగులు సరిదిద్దుకోవడం ఎట్లా?

ఈ ప్రశ్నకు సమాధానం ఎప్పటికైనా దొరకదా?" అనుకున్నాడు.

ఈ ప్రశ్న మరీ బాధించినప్పుడు సరోజిని ఇంటికి వెళ్తాడు. ఒకసారి అంతా మరిచిపోయి, తిరిగి ఇల్లు చేరుకుంటాడు.

సరోజినికిగానీ, ఇటు జానకికిగానీ తన బాధ ఏమిటో తెలియజేయడం ప్రసాదరావు మతం కాదు. ★